క్లుప్తంగా

కళాకారులకు ఆర్థికసాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్

తలకొండపల్లి: కళాకారులకు ఆర్థిక సహాయం అందజేసి అండగా ఉంటానని మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని వెల్జాలోని వేదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా కళాకారులు 3 రోజుల పాటు లక్ష్మీనరసింహ్మ స్వామి స్టేజీ నాటకాన్ని ప్రదర్శిస్తున్నారు. కను మరుగవుతున్న కళలను ప్రదర్శించి, ప్రజలకు అర్థమయ్యే రీతిలో నాటక రూపంలో చక్కగా వివరిస్తున్నారు. వీరి ప్రతిభను గుర్తించి కళలను ప్రోత్సాహించాలనే ఉద్దేశ్యంతో శ్రీనివాస్ యాదవ్ బుధవారం వారికి రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నారాయణ, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తి, అంబాజీ, అజీజ్, విష్ణువర్ధన్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తలకొండపల్లి: మండల పరిధిలోని చెన్నారం సమీపంలో వెలిసిన మల్లప్పగుట్ట శివాలయ బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య గణపతి పూజ, ఏకవార రుద్రాభిషేకం, పాశుపత రుద్రహోమం, అఖండ దీపారాధన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 8న శివరాత్రి పర్వదినాన ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించబడుతుందని.. భక్తులు రుద్రాభిషకంలో పాల్గొన్ని స్వామి అనుగ్రహాన్ని పొందాలని ఆలయ అధ్యక్షుడు మాకం పాండయ్య చెప్పారు.

ఎల్‌ఆర్‌ఎస్ సర్టిఫికెట్లు ఉచితంగా ఇవ్వాలి

యాచారం: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించి పేదలకు ఉచితంగా సర్టిఫికెట్లు జారీచేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ డిమాండ్ చేశారు.యాచారంలో బుధవారం ఆమె మాట్లాడుతూ... ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతలు గతంలో ప్రతిపక్షంలో ఉండి అప్పటి కేసీఆర్ సర్కార్‌ను ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించి ఉచితంగానే సర్టిఫికెట్లను ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు గుర్తుచేశారు. అప్పటి వారి డిమాండ్‌ను నిలబెట్టుకునే విధంగా ప్రస్తుత ప్రభుత్వంలో ఉన్న మంత్రులు కృషి చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని అన్నారు.

ఆరుట్ల అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ

కాంగ్రెస్ నేత చంద్రయ్య



రోడ్డు పనులను పరిశీలిస్తున్న నాయకులు

మంచాల: ఆరుట్ల అభివృద్ధికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుడ్డిమల్ల చంద్రయ్య అన్నారు. ఆరుట్లలో ఎమ్మెల్యే సహకారంతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.39 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీటీసీ సభ్యుడు కావలి శ్రీనివాస్‌తో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో ఆరుట్లలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరుగలేదన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అడిగిన వెంటనే గ్రామానికి నిధులు ఇవ్వడమే గాకుండా ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. ఆరుట్లగ్రామ ప్రజలందరి తరుపున ఎమ్మెల్యే మల్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఐలయ్య, సురేష్, జంగారెడ్డి, ప్రవీణ్, సికిందర్‌రెడ్డి, నాగరాజ్, పరమేష్, రాయుడు, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

తుర్కయంజాల్: పెట్రోల్ బంక్‌ల నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే అనుమతులు రద్దు చేస్తామని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన సాగర్ రోడ్డు ఇంజాపూర్, బీఎస్.రెడ్డి నగర్, తుర్కయంజాల్‌లోని పెట్రోల్ బంక్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెట్రోల్ బంక్‌ల నిర్వాహకులు వివిధ శాఖల అనుమతి పత్రాలను సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలని, లేని పక్షంలో అపరాధ రుసుముతో పాటు, శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పెట్రోల్‌లో కల్తీ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

వందశాతం సేకరణే లక్ష్యం

ఇంటిపన్ను వసూలులో కార్యదర్శులు

- ఇప్పటివరకు 60శాతం మేర వసూలు
- చెల్లించనివారిపై చర్యలు తప్పవంటున్న అధికారులు



మంచాల ఎంపీడీఓ కార్యాలయం

మంచాల: పంచాయతీలకు ప్రధాన ఆదాయవనరైన ఇంటిపన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని అధికారులు కోరారు. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి తిరిగి పన్నులు వసూలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. మంచాల మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలో 12,780 ఇళ్లు ఉన్నాయి. ఈ సంవత్సరం రూ. 56,21,620 ఇంటిపన్ను వసూలు కావాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.35,18,262 వసూలు చేశారు.

తిరిగి అభివృద్ధి పనులకే..

గ్రామాల్లో వసూలు చేసే ఇంటిపన్ను తిరిగి గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతుల కల్పించడానికే ఖర్చుపెడతారు. వసూలు చేసిన పన్నుల్లో 8శాతం గ్రంథాలయ శాఖకు చెల్లించగా మిగతావి గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాలు, ట్రాక్టర్ నిర్వహణ ఖర్చులు, పారిశుద్ధ్య నిర్వహణకు ఖర్చు పెడతారు. ఇంకా మిగిలి ఉంటే గ్రామాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల ఏర్పాటుకు కూడా ఉపయోగిస్తారు. ప్రతి ఇంటి నుంచి పన్ను వసూలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉండటంతో అధికారులు ఒకటికి నాలుగు సార్లు ఇంటింటికి తిరిగి పన్ను వసూలు చేస్తున్నారు. ఈఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి 100 శాతం పన్నులు వసూలు చేయాల్సిందేనని ఉన్నతాధికారులనుంచి స్పష్టమైన ఆదేశాలున్నాయని కార్యదర్శులు తెలిపారు.

పన్నులు చెల్లించాలి



మంచాల గ్రామంలో 1357 ఇళ్లకు రూ. 6,27,738 పన్ను డిమాండ్ ఉంది. ప్రస్తుతం రూ.3,16,669 వసూలు చేశాం. ఇంకా 50 శాతం మేర వసూలు చేయాల్సి ఉంది. ప్రతి ఒక్కరూ ఇంటిపన్ను చెల్లించాలి.

– రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, మంచాల

చెల్లించకుంటే చర్యలు



గ్రామాల్లో ప్రజలకు సౌకర్యాలు కల్పించాలంటే పన్నులు కూడా వసూలు చేయాల్సిందే. ప్రజలందరూ ఇంటి పన్ను చెల్లించి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటును అందించాలి. పన్నులు చెల్లించని వారాపై చర్యలు తప్పవు.

– తేజ్‌సింగ్, ఎంపీఓ, మంచాల

సేవా కార్యక్రమాలు అలవర్చుకోవాలి



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులతో అతిథులు, ఉపాధ్యాయులు

- యూఎస్ ఏపీఏ కంపెనీ ఎగ్జిక్యూటివ్ క్లైంట్ శౌరే
- ప్రభుత్వ విద్యార్థులకు టీషర్టులు, బాటిల్స్ అందజేత

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రతి ఒక్కరూ సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని యూఎస్ ఏపీఏ కంపెనీ ఎగ్జిక్యూటివ్ క్లైంట్ శౌరే పేర్కొన్నారు. బుధవారం ఆదిబట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్పోర్ట్స్, కల్చరల్ కార్యక్రమాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి. అనంతరం విద్యార్థులకు రూ.25వేల విలువైన స్పోర్ట్స్ టీషర్ట్స్, రూ.10 వేల విలువైన ప్లేట్లు, వాటర్ బాటిల్స్ అందజేశారు. పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు షీల్డ్, మెడల్స్ అందించారు. అనంతరం శౌరే మాట్లాడుతూ.. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తానన్నారు. స్టడీ టూర్ కోసం కావాల్సిన ఖర్చులను అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ క్లాండ్స్ శ్రీధరన్, మధు, మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, మండల పంచాయతీరాజ్ ఏఈ ఇంద్రాసేనారెడ్డి, కృష్ణారెడ్డి, రాములు, జగదీశ్వర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, చంద్రశేఖర్, ఆనంద్‌కుమార్, గోవర్ధన్, హరిప్రసాద్, అక్బర్, బాబ్లీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలకు చెక్

ఏఎస్‌ఐ సీతారాంరెడ్డి



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏఎస్‌ఐ సీతారాంరెడ్డి

తలకొండపల్లి: సీసీ కెమెరాలతో భద్రత మరింత కట్టుదిట్టమైతుందని ఏఎస్‌ఐ సీతారాంరెడ్డి అన్నారు. ప్రతి తండాలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తండావాసులకు సూచించారు. మండల పరిధిలోని ఆర్లకుంట తండాలో డాక్టర్ భీంలాల్ తన సొంత నిధులతో 8 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. బుధవారం ఏఎస్‌ఐ సీతారాంరెడ్డి డాక్టర్ భీంలాల్‌తో కలిసి సీసీ కెమెరాలను ప్రారంభించారు. అనంతరం పోలీసులు శాలువాలతో డాక్టర్ భీంలాల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈశ్వర్, పోలీస్ సిబ్బంది, తండావాసులు తదితరులున్నారు.

చలివేంద్రం ప్రారంభం

మీర్‌పేట: వేసవి దృష్ట్యా పాదచారులు, వాహనదారుల కోసం చలివేంద్రం ఏర్పాటు చేశామని వీటీ రాయల్ ఫౌండేషన్ గ్రూప్ చైర్మన్ కసిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి గాయత్రినగర్ చౌరస్తాలో బుధవారం తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వెంకటేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. తనవంతు బాధ్యతగా ఈ ప్రాంతంలో గత ఎనిమిదేళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని, అదే విధంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ జి.ప్రవీణ్‌కుమార్, సీఈఓ డి.ధరణీశ్వర్, బ్రాంచి మేనేజర్ కాలేరు నిఖిత, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



తలకొండపల్లి: వేదాద్రి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్ వేదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంగీత, శ్రీనివాస్‌యాదవ్, అన్నదాత, ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, ఆలయ ధర్మకర్త శ్రీనివాసమూర్తి శర్మ, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రవికుమార్, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాసమూర్తి, అంబాజీ, అజీజ్, నర్సింహులు, శ్యాంసుందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అశోక్, విష్ణువర్ధన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యసాగరంలో..

ఆమనగల్లు: మండలంలోని రాంనుంతల అయ్యసాగరం అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కరుణాకర్‌రెడ్డి, నర్సిరెడ్డి, పంచాక్షరి, మల్లప్ప, వీరయ్య, వైద్యనాద్, ఎంపీటీసీ సభ్యులు పంతునాయక్, మాజీ సర్పంచ్ శ్రీనునాయక్, అర్చకులు చంద్రశేఖర్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

ఆమనగల్లు: మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలకు ఆలయం ముస్తాబైంది. ఈనెల 7, 8 తేదీల్లో వార్షికోత్సవాలను నిర్వహించనున్నారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఎంపీటీసీ సభ్యుడు కిషన్‌రెడ్డి కోరారు.

నేటి నుంచి మైసిగండి ఉత్సవాలు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి గ్రామంలోని శివరామాలయాల్లో కొలువైయున్న శ్రీ కాశీవిశ్వనాథ స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ట్రస్టీ శిరోలీ, ఈఓ స్నేహలత తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఐఐహెచ్‌టీ మంజూరుపై హర్షం

ఆమనగల్లు: తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం.. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ) విద్యాసంస్థను మంజూరు చేయడం పట్ల మాడ్గుల మండల పద్మశాలీ సంఘం అధ్యక్షులు అశోక్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఈ విద్యాసంస్థ ద్వారా రాష్ట్రంలోని పద్మశాలీ యువత చేనేత రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సాధించేందుకు, చేనేత వృత్తిలో మెలకువలు నేర్చుకునేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. విద్యాసంస్థ మంజూరుకు కృషిచేసిన సీఎం రేవంత్‌రెడ్డి, చేనేత జౌళి శాఖామంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావ్, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆ సంఘం నాయకులు వినోద్, రాములు, వెంకటేశ్, చంద్రమౌలి, సంతోష, నరేశ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

శివస్వాములకు ఆర్థికసాయం

కడ్తాల్: భక్తి భావంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో శివస్వాముల ఆధ్వర్యంలో నిర్వహించిన మహాపడిపూజలో జెడ్పీటీసీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇరుముడి ధారణ చేసిన శివస్వాములు శ్రీశైలం బయలుదేరగా.. వారికి వైస్ ఎంపీపీ సమకూర్చిన రూ.10 వేలను జెడ్పీటీసీ అందజేశారు. అదే విధంగా శివస్వాములకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్వింటాల్ సన్న బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్, గణేశ్, లక్ష్మయ్య, సత్యం తదితరులు ఉన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం



కల్యాణం జరిపిస్తున్న ఎంపీటీసీ జ్యోతి

యాచారం: మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లిలో బుధవారం ఎల్లమ్మ, జమదగ్ని దేవతా మూర్తుల కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఎంపీటీసీ సభ్యురాలు కొర్ర జ్యోతి, అరవింద్ నాయక్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణోత్సవం సందర్భంగా ఎల్లమ్మ తల్లికి గురువారం బోనాల సమర్పణ ఉంటుందని ఎంపీటీసీ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొహెడ జెడ్పీహెచ్‌ఎస్‌లో మాక్ పోలింగ్



ఓటుహక్కు వినియోగించుకున్న విద్యార్థులు

తుర్కయంజాల్: ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కీలక పాత్ర పోషిస్తాయని.. అలాంటి ఎన్నికల్లో సరైన అభ్యర్థులను ఎన్నుకోవాలని తుర్కయంజాల్ మున్సిపాలిటీ కొహెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తిరుపతి బాయి అన్నారు. బుధవారం ఆ పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సర్పంచ్ స్థానానికి 6 మంది, వార్డు మెంబర్లుగా 25 మంది పోటీ చేశారు. విద్యార్థులంతా క్యూలైన్‌లో నిల్చుని ఓటు హక్కును వినియోగించుకున్నారు. సర్పంచ్‌గా బుడ్డా సాయి కుమార్ తన సమీప అభ్యర్థి సౌమ్యపై 96 ఓట్ల తేడాతో గెలుపొందారు. వార్డు మెంబర్లుగా ఆర్.నివాస్, వికాస్, వెంకటేష్, అఖిల్‌ను ఎన్నుకున్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఎన్నికలపైన అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్‌రాజు, లక్ష్మణ్, గోపాల్‌రెడ్డి, కొండయ్య, రాధా, మాధవి, చారి, మంజుల, అశోక్, వెంకటేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

తహసీల్దార్ సునీత



ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ మహిళా ఉద్యోగులతో తహసీల్దార్ సునీత

ఇబ్రహీంపట్నం రూరల్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీత పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం బస్‌స్టేషన్ ఆవరణలో మహిళా కండక్టర్లు, ప్రయాణికులులతో కలిసి మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులను, ప్రయాణికులను సత్కరించారు. ఉత్తమ ప్రతిబ కనబర్చిన కండక్టర్లకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీత మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న అరాచకాలను ఎండగట్టాలన్నారు. ప్రతీ మహిళ ప్రశ్నించేతత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. చదువు పట్ల అవగాహన పెంచుకోవాలని కోరారు. సమాజంలో లింగ బేధం రాజ్యమేలుతోందని మహిళలు ఎక్కడా తక్కువ కాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకట నర్సప్ప, అసిస్టెంట్ మేనేజర్ సరస్వతి, అసిస్టెంట్ ఇంజనీర్ సత్తయ్య, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వెల్ఫేర్ కమిటీ సభ్యులు వైవీ.రెడ్డి, మల్లికా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



తలకొండపల్లి: ఉపాధ్యాయులతో విద్యార్థులు

తలకొండపల్లి/ఆమనగల్లు: తలకొండపల్లి మండలం బలుసులపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. డీఈఓగా హిమబిందు, ఎంఈఓగా సింధు, ప్రధానోపాధ్యాయురాలిగా అక్షిత వ్యవహరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయులు మల్య, ఉపాధ్యాయులు జంగయ్య, శ్రవన్‌కుమార్, రాంచంద్రయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు గ్రామర్ హైస్కూల్‌లో..

పట్టణంలోని ఆమనగల్లు గ్రామర్ హైస్కూల్‌లో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యాశాఖ మంత్రిగా నిహారిక, ప్రిన్సిపాల్‌గా రఘుపతి, సుదీప్, సీఈఓగా విఘ్నేష్, కలెక్టర్‌గా హర్షవర్ధన్, డీఈఓగా సాయిప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ డీఈఓగా అక్షయ, ఎంఈఓగా విశ్వస్ర, డైరెక్టర్‌గా మీనాక్షి వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు గ్రామర్ హైస్కూల్ యాజమాన్యం ప్రదీప్‌కుమార్, సంజీవ్ కుమార్, వెంకటేశ్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సులో మన నేతలు



ఎమ్మెల్యే మల్‌రెడ్డిని సన్మానించిన అతిథులు

మంచాల: ఈనెల 5న నగరంలోని రవీంద్రభారతిలో నిర్వహించిన అంతర్జాతీయ శాంతి సదస్సుకు స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో పాటు ఆరుట్ల మాజీ సర్పంచ్ కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. గ్లోబల్‌హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ ఇండియా అనే సంస్థ ప్రపంచ వ్యాప్తంగా శాంతి సందేశాలు చేయడమే గాకుండా వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన 40మందికి గౌరవ పురస్కారాలు అందించడం గొప్ప పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో ఆసంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, ఫహీమ్ సయ్యద్, సీమా ఫాతిమా, పరమజీత్ సింగ్, జునైద్ రఫీక్, రేణుక తదితరులు పాల్గొన్నారు.


పాడిరైతుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నాకు తరలివెళ్తున్న పాడిరైతులు

కడ్తాల్: పాడి రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం లాలాపేట్‌లోని పాడిపరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య ప్రధాన కార్యాలయం వద్ద చేపట్టిన మహాధర్నా కార్యక్రమానికి మండల పరిధిలోని గ్రామాల నుంచి పాడి రైతులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత రెండు నెలలుగా పాలబిల్లులు సకాలంలో అందడం లేదని, అలాగే మూడేళ్లుగా పాడిరైతులకు పాల ప్రోత్సాహకం కూడా అందడం లేదని అన్నారు. పాడి రైతులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు వెంకటేశ్, రామకృష్ణ, ప్రశాంత్, సుధాకర్‌రెడ్డి, కృష్ణయ్య, రంగానాయక్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మైసమ్మ సన్నిధిలో ఎంపీ రాములు



కడ్తాల్: మైసమ్మ సన్నిధిలో ఎంపీ రాములు, నాయకులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారితో కలిసి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు పి.రాములు బుధవారం దర్శించుకున్నారు. ఎంపీ రాములుకు ఆలయ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అమ్మవారికి ఎంపీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకుని మైసిగండి శివాలయంలో నిర్వహించే శ్రీ కాశీవిశ్వనాథుడి బ్రహ్మోత్సవ ఆహ్వానపత్రికను ఆలయ నిర్వాహకులు ఎంపీ రాములుకు అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు మాన్యనాయక్, రాందాస్‌నాయక్, లక్ష్మన్‌నాయక్, శ్రీకాంత్‌సింగ్, శంకర్‌నాయక్, శ్రీశైలం గౌడ్ తదితరులు ఉన్నారు.

ఎంపీకి సత్కారం..

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ ఎంపీ రాములును బీజేపీ నాయకులు ఘనంగా సత్కరించారు. వెల్దండ మండల కేంద్రంలో బుధవారం జరిగిన బీజేపీ మహిళాశక్తి సమావేశంలో పాల్గొన్న ఎంపీ రాములును మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజయ్‌కృష్ణ, నర్సింహ, లక్ష్మణ్, చెన్నకేశవులు, శ్రీకాంత్‌సింగ్, శ్రీను తదితరులు ఉన్నారు.